క్లుప్తంగా

29న ఆలయ వార్షికోత్సవం

తుగ్గలి : మండలంలోని రాంపల్లిలో వెలసిన సద్గురు కాశిరెడ్డినాయన 19వ ఆలయ వార్షికోత్సం ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేకువజాము నుంచే స్వామికి పురోహితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతారన్నారు. 29న రాత్రి పంచమాంకములు ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన, డీ పోటీలు, గ్రామానికి చెందిన కళాకారుడు శీనుతో గజ్జల పూజ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

స్వయం ఉపాధిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

చిప్పగిరి: స్వయం ఉపాధి అవకాశాలపై గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం నాగార్జున మండల వీబీకేలకు సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని వీబీకేలతో సమావేశం నిర్వహించారు. మహిళలకు వివిధ పథకాల ద్వారా బ్యాంకు సహకారంతో అందించే స్వయం ఉపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో లోకోస్ యాప్ ద్వారా సంఘాలు చేయడం, విజన్ బిల్డింగ్, బ్యాంక్ లీంకేజ్, సీఐయాప్ తదితర వాటిపై వివరించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ సునీత

ఆస్పరి: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఆలూరు ఏడీఏ సునీత డీలర్లను హెచ్చరించారు. బుధవారం ఆస్పరిలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్ల దగ్గర ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారిక మందులు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదులను తీసుకోవాలన్నారు. డీలర్లు దుకాణాల ముందు ధరల బోర్డు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా డీలర్లు అధిక ధరలకు అమ్మితే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఆస్పరి ఏఓ నరేంద్రకుమార్ ఉన్నారు.

29న కొండప్పస్వామి ఆరాధనోత్సవం

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ సమీపంలోనున్న శ్రీకొండపస్వామి ఆలయంలో ఈనెల 29వ తేదీన స్వామి వారి 46వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు బుధవారం తెలిపారు. 29న నగర సంకీర్తనలు, ఊరేగింపు కార్యక్రమాలుతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయని అలాగే 30న పూజలతో పాటు అన్నదానం ఉంటుందని చెప్పారు.

కుక్కలకు రేబిస్ టీకాలు



కుక్కకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

మద్దికెర : కుక్కలు కరిచినా రేబిస్ వ్యాధి సోకకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి కృష్ణానాయక్ తెలిపారు. బుధవారం కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలపై దాడులు చేస్తున్నాయని, దీంతో పలువురికి రేబిస్ సోకినట్లు ఆందోళన వ్యక్తం చేయడంతో రేబిస్ టీకాలు తెప్పించి వేస్తున్నామని చెప్పారు.

ఆలూరు ఆస్పత్రిలో పారిశుధ్య లోపం



నీటి పైప్ లీకేజీతో ఆస్పత్రి ఎదుట నిలిచిన నీరు

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్యం పడకేసింది. ఆస్పత్రి ల్యాబ్ పక్కనే తాగునీటి పైపు లీకేజీతో నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కొద్ది రోజులుగా ఇక్కడ నీరు వృథాగా పోతున్నా అధికారులు స్పందించడం లేదు. ఆస్పత్రి చుట్టూ నీరు చేరి మురుగా మారి దోమలకు ఆవాసంగా మారింది. ఓపీకి వెళ్లే రోగులు ఈ మార్గం ద్వారానే డాక్టర్ల దగ్గరకు వెళ్తుంటారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం కావడంతో రోగాల బారినపడి ఆస్పత్రిలో చికిత్స కోసం వస్తుంటే ఇక్కడ కూడా దోమల బెడద తప్పడం లేదని రోగులు వాపోతున్నారు.



ఎద్దుల బండిలో వెళ్తున్న రైతన్న



పనులకు వెళ్తున్న కూలీలు

తెలవారగానే..

సూర్యోదయానికే పొలాలకు వెళ్లడం అన్నదాతలకు అలవాటు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అడపాదడపా వానలు పడుతున్నాయి. తెల్లవారితే చాలు.. తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రైతన్న పొలం పనులకు పరుగులు పెడుతున్నాడు. కొందరు పొలాలను చదును చేస్తుండగా.. మరి కొందరు విత్తనాలు వేస్తున్నారు. కూలీలు పనుల కోసం వెళ్తున్నారు. ఏమైతేనేం పంటలు పండించేందుకు రైతులు, కూలీలు అహర్నిశలు కృషి చేస్తున్నారు. – మద్దికెర



పొలాన్ని చదును చేస్తున్న అన్నదాత



విత్తనం వేస్తున్న దృశ్యం

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆరవ తరగతికి సంబంధించి ఒక్క ఖాళీ (ఓసీ) ఉందన్నారు. అర్హులైన విద్యార్థినిలు ఈ నెల 28న సాయంత్రం 4 గంటలలోపు ఆధార్, పాస్‌ఫొటోలతో దరఖాస్తు పాఠశాలలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29న పాఠశాలలో పరీక్ష నిర్వహించి అధిక మార్కులు సాధించిన వారికి సీటు కేటాయిస్తామని పేర్కొన్నారు.

వెల్దుర్తి గురుకులలో..

వెల్దుర్తిలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 28న సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన తెలిపారు. ఆరవ తరగతిలో ఎస్సీ-1, 7వ తరగతిలో ఎస్టీ-1, 8వ తగరతిలో ఎస్సీ-1, ఓసీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు పాఠశాలలో పరీక్ష ఉంటుందని, పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

మద్దికెర : ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలతో పాటు దుస్తులు, బ్యాగులు ఇవ్వడమే గాకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రత ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓలు రంగస్వామి, గోపాల్ కోరారు. బుధవారం కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా డిజిటల్ సౌకర్యాలు కల్పించిందని అనవసరంగా పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి వ్యయప్రయాసలకు లోనుకావద్దన్నారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం



ఆలూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సెబ్ సీఐ సోమశేఖర్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల-1,2, మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి బుధవారం ఆలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్, గుంతకల్లు చెక్‌పోస్టు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువత మత్తుపదార్థాలు, చెడువ్యసనాలకు బానిసగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కొందరు సరదా కోసం మాదకద్రవ్యాలు తీసుకుని తర్వాత వాటికి పూర్తి బానిసలుగా మారి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. గంజాయి, గుట్కా, పొగాకు, సిగరెట్ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హాలహర్వి, చిప్పగిరి ఎస్‌ఐలు నరేంద్ర, రిజ్వాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పత్తికొండ రూరల్ : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం పత్తికొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ స్వర్ణలత ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి తేరుబజారు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సెబ్, పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, దీని వల్ల వారి బంగారు భవిష్యత్ అంధకారం అవుతుందని వెల్దుర్తి సీఐ బీవీ మధుసూదన్, కర్నూలు ఫ్యాక్షన్ జోన్ సీఐ జయన్న అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనారోగ్యాలు, అనర్థాల గురించి వివరించారు. వీటి జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని చెప్పారు. కళాశాలలో, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా తమకు తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ నాగభూషణంరెడ్డి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ బీవీ మధుసూదన్



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సెబ్ అధికారులు, విద్యార్థులు

మత్తుకు చిత్తు కావొద్దు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు

హొళగుంద: మత్తుపదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు బుగ్గి అవుతాయని హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు అన్నారు. బుధవారం హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. పొగ, మద్యం, గంజాయి, కొకైన్ లాంటివి యువతను ముంచేస్తుందన్నారు. ఒకసారి వీటికి అలవాటు పడితే వాటిని వదల్లేక శారీరకంగా, మానసికంగా దెబ్బతింటారని తెలిపారు. మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా బాగా చదివి వారికి మంచి పేరు తీసుకురావాలని హితవుపలికారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ కలిగి ఉంటే సమాజంలో గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో తేడాలు వస్తే చర్యలు

● ఆలూరు తహసీల్దార్ చంద్రశేఖరయ్య

ఆలూరు: నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు తహసీల్దార్ చంద్రశేఖరయ్య డీలర్లను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్డుదారునికి ప్రభుత్వం మంజూరు చేసిన సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. కాగా తహసీల్దార్ ఆదేశాలతో సివిల్ సప్లైస్ గోదాములో ముగ్గిపోయిన 38 క్వింటాళ్ల బియ్యం, 73 కేజీల కందిబ్యాడలు, 36 కేజీల చక్కెరను గోదాం ఆవరణలో జేసీబీతో గుంత తీసి పూడ్చి వేశారు. ఆర్‌ఐ బసన్నగౌడు, గోదాం ఇన్‌చార్జ్ బలరామిరెడ్డి, వీఆర్వో సుధాకర్ పాల్గొన్నారు.



చెడిపోయిన సరుకులను పూడ్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

సర్పంచ్‌ల సమస్యలపై వినతి

హొళగుంద: సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అధికారాలకు సంబంధించి ఆదోని డివిజన్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్, చిన్నహ్యాట సర్పంచ్ హేసన్ తదితరులు బుధవారం కర్నూలుకు వచ్చిన 5వ ఆర్థిక సంఘం ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఉపాధి హామీ నిధులను సర్పంచ్‌లు చేసే అభివృద్ధి పనులకు ఇవ్వాలని, 15 ఆర్థిక సంఘం నిధులు ఇవ్వాలని, గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలని, సర్పంచ్‌ల గౌరవ వేతనం పెంపు సహా వివిధ సమస్యలను పేర్కొన్నారు.



ఆర్థిక సంఘం ప్రతినిధులకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

ఛత్రపతి సాహు ఆదర్శనీయుడు



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

ఆలూరు: సంఘ సంస్కర్త, రిజర్వేషన్ల పితామహుడు చత్రపతి సాహు మహారాజ్ ఆదర్శనీయుడని బీఎస్పీ ఆలూరు నియోజకవర్గ అధ్యక్షుడు రామ లింగయ్య అన్నారు. సాహు జయంతిని పురస్కరించుకుని స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అట్టడుగువర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. రామలింగయ్య, నాగరాజ్, వీరన్న, రవికుమార్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో దోమల నివారణకు స్ప్రే

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలోని ఎస్‌డబ్ల్యూ బాలిక, బాలుర హాస్టళ్లతో పాటు దేవనకొండలోని కేజీబీవీ హాస్టల్‌లో జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు దోమల నివారణకు స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దోమకాటు చాలా ప్రమాదకరమని, దోమల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. హాస్టళ్లల్లో చదువుతున్న విద్యార్థులు దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, పీహెచ్‌సీ సూపర్‌వైజర్స్ రంగస్వామి, జయలక్ష్మి, శ్రీధర్ పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్లు స్వాధీనం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని గోవర్ధనగిరి చెరువు సమీపంలో బుధవారం అక్రమంగా గ్రావెల్ తవ్వుతుండగా పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జేసీబీతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా పొలాలకు గ్రావెల్ తరలిస్తున్న విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీస్ సిబ్బంది తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని అడ్డుకున్నారు. పోలీసులు రావడంతో వాహనదారులు పరారయ్యారు. జేసీబీతో పాటు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బస్‌షెల్టర్ లేక అవస్థలు



బస్సు కోసం రోడ్డుపై వేచివున్న విద్యార్థులు

చిప్పగిరి: మండల కేంద్రం చిప్పగిరి ప్రధాన కూడలిలో బస్‌షెల్టర్ లేకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, వివిధ పనుల కోసం విద్యార్థులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉన్న ఒక్క బస్‌షెల్టర్ ఊరి బయట నిర్మించడంతో నిరుపయోగంగా.. మందు బాబులకు అడ్డాగా మారింది. దీంతో బస్సుల కోసం రోడ్డుపైనే వేచిచూడాల్సిన పరిస్థితి. వర్షం వస్తే గత్యంతరం లేక వాణిజ్య సముదాయాల వద్ద తలదాచుకోవాల్సిందే. ప్రజలకు ఉపయోగపడేలా ప్రధాన కూడలిలో బస్‌షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: కాకినాడలో జూలై 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్ కోరారు. బుధవారం ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కరపత్రాలను విడుదల చేశారు. విద్యార్థులు చదువుతో పాటు రాజకీయాలపై ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలన్నారు. నాయకులు ఈశ్వర్, రాజు, రమేష్, దస్తగిరి పాల్గొన్నారు.

ఎల్లెల్సీ గట్టుపై జంతువుల వ్యర్థాలు

హొళగుంద: బళ్లారి రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) గట్టు, పరిసరాలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. కొందరు ఏకంగా పందులను కాలుస్తున్నారు. మరికొందరు కోడి ఈకలు, వ్యర్థాలను వేయడం, మరికొందరు పంది, కుక్కలు ఇతర జంతువుల కళేబరాలను పడేస్తున్నారు. కాల్చిన బూడిద, ఇతర చెత్త కాలువలో పడి నీరు కలుషితమవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువ గట్లపై పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హొళగుంద వద్ద పందిని కాలుస్తున్న స్థానికులు

రైతులను ఆదుకోవాలని వినతి

ఆలూరు: మండలంలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీలో పంటలు సాగు చేసిన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మునిస్వామి, నాగరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం రైతులతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సన్న, చిన్నకారు రైతులకు రాయితీతో డ్రిప్ పరికరాలు, పండ్ల తోటలకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రేపటి నుంచి దేవరగట్టులో వరుణయాగం

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు వరుణ యాగ పూజలు నిర్వహించనున్నట్లు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి తెలిపారు. బెల్డోణ రామ శాస్త్రీ ఆధ్వర్యంలో వరుణయాగ పూజలు జరుగుతాయని.. ఇందు కోసం ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ వరుణయాగం, కుంభోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పెద్దగోనెహాళ్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేశారు. డ్రైనేజీల్లో మురుగునీరు, పూడికను తొలగించారు. దోమల నివారణకు వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామని సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి తెలిపారు. ఎక్కడపడితే అక్కడ చెత్తపడేయకుండా, వీధుల్లో మురుగునీరు వదలకుండా గ్రామ శుభ్రతకు సహకరించాలని కోరారు.



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

రేపు పంచాయతీ వేలాలు

పత్తికొండటౌన్: ఈనెల 28వ తేదీన స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ మార్కెట్లకు ఒక ఏడాది పాటు రుసుం వసూలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చేందుకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఈఓ మాట్లాడుతూ వారపు సంత, దినపు కూరగాయల మార్కెట్, బస్టాండు, మాంసం మార్కెట్‌లకు వేలాలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల వారు తగిన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

దూరవిద్య ద్వారా లక్ష్యాలను చేరుకోండి

వెల్దుర్తి(కృష్ణగిరి): చదువుపై ఆసక్తి ఉండి విద్యకు దూరమైన విద్యార్థులు దూరవిద్య ద్వారా మళ్లీ విద్యను అభ్యసించి తమ లక్ష్యాలను చేరుకోవాలని వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ, కేవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేష్‌బాబు తెలిపారు. వెల్దుర్తిలోని కేవీఆర్ కాలేజీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దూర విద్యలో చేరాలనుకునే వారు స్థానిక కాలేజీలో సంప్రదించాలని కోరారు. దూరవిద్యలో ఇంటర్, డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.